క్లుప్తంగా

మినీ ఆటో ఢీకొని వ్యక్తి మృతి



పిడుగురాళ్ల: టైర్ పగిలి మినీ ఆటో అదుపు తప్పి వ్యక్తిని ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పిడుగురాళ్ల పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. ఘటనకు సంబంధించి పట్టణ ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని గురజాలకు చెందిన చొప్పవరపు సత్యనారాయణ(53) అమృత టిఫిన్ సెంటర్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా దాచేపల్లి నుంచి కొండమోడు వైపు మిర్చి లోడుతో వెళ్తున్న ఆటో టైర్ పగలటంతో అదుపు తప్పి సత్యనారాయణను ఢీకొనటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్యతోపాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

గ్రామాభివృద్ధికి నిధులను సక్రమంగా వినియోగించండి



మాచవరం: ప్రజాప్రతినిధులు ప్రణాళికాబద్ధంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ యు.బి.వరప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి గానూ మండలంలోని పలు గ్రామాల అభివృద్ధి పనుల నిర్వహణకు వార్షిక ప్రణాళికలు తయారు చేసేందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులు సక్రమంగా వినియోగిస్తూ పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెంగళరావు, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, సర్పంచులు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ అల్లాభక్షు, పలు గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దు



పిడుగురాళ్ల: ప్రతి ఒక్క డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసి ప్రమాదాలకు గురి కావద్దని పట్టణ ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ సూచించారు. పట్టణ ఆర్టీసీ బస్సు డిపోలోని గ్యారేజీలో బుధవారం రోడ్డు భద్రత మాసోత్సవాల కార్యక్రమానికి పట్టణ ఎస్ఐ రబ్బానీ ఖాన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ వలన ప్రయాణంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని, ఆర్టీసీ బస్సు బ్యాలెట్ మీద ప్రయాణికులను కూర్చొబెట్టి డ్రైవింగ్ చేయరాదని, సమయ పాలన పాటించి వాహనాలను నడపాలని తెలిపారు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. వేగం కన్న భద్రత ముఖ్యమని ఆయన సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.ముక్తేశ్వరరావు మాట్లాడుతూ రోడ్డు భద్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆర్టీసీ డ్రైవర్లకు, కండక్టర్లకు వివరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సూపర్‌వైజర్లు సిబ్బంది, డ్రైవర్లు, మెకానిక్‌లు, కండక్టర్లు హాజరయ్యారు.

వినుకొండలో పోలీస్ పికెట్ ఏర్పాటు



వినుకొండ(నూజెండ్ల): శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై రౌడీషీట్ నమోదు చేస్తామని పట్టణ సీఐ సాంబశివరావు హెచ్చరించారు. మంగళవారం వినుకొండలో వైఎస్సార్ సీపీ, టీడీపీ వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలవడంతో శాంతిభద్రతల దృష్ట్యా వినుకొండలో నాలుగుచోట్ల పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎవరైనా అనుచరగణంతో తిరగడం, రాత్రి వేళల్లో గుంపులుగా కూడటం వంటి కార్యకలాపాలు నిర్వహించకూడదన్నారు. ప్రతిఒక్కరూ సామరస్య పూర్వకంగా పోలీసులకు సహకరించాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

రైతన్నకు భరోసా

- పక్కాగా 9 గంటల కరెంటు
- మండలంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు


నిర్మాణం పూర్తయిన మిరియాల సబ్‌స్టేషన్



కారెంపూడి: గడచిన నాలుగున్నరేళ్ల కాలంలో నిరంతరాయంగా 9 గంటలు విద్యుత్ సరఫరా చేస్తూ ప్రభుత్వం రైతన్నల మన్ననలు అందుకుంటోంది. గతంలో కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియక అర్ధరాత్రి అపరాత్రులు పొలాలకు రైతులు పరుగులు తీసే పరిస్థితిని చూశాం. కాని ప్రస్తుతం 9 గంటలు నిరంతరాయంగా కరెంటు సరఫరా చేస్తుండడంతో రైతులు రిస్క్ లేకుండా పంటలకు నీరు పెట్టుగోగలుగుతున్నారు.

గతంలో 10 కనెక్షన్లకు కలిపి ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఉండేది. అది తరచూ కాలిపోవడం లేకుంటే మరమ్మతులకు గురికావడం జరిగేది. ప్రతి కనెక్షన్‌కు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ మండలంలో ఏర్పాటు చేస్తున్నారు. లోవోల్టేజీ సమస్యలు తలెత్తకుండా మోటార్లు కాలిపోకుండా విద్యుత్ శాఖ చర్యలు తీసుకుంటోంది. కాల్వలకు సాగు నీరు రాని ప్రస్తుత కాలంలో 9 గంటలు నాణ్యమైన కరెంటు ఇవ్వడం వల్ల బోర్ల కింద రైతులు వరితో పాటు మిర్చి, పత్తి లాంటి పంటలను పండించుకుంటున్నారు.

ఈ నేపథ్యంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఒకసారి పరిశీలిస్తే.. మండలంలోని మిరియాల గ్రామంలో 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. సుమారు రూ.3 కోట్లతో నిర్మాణం జరిగింది. దీంతో గ్రామ రైతులకు నాణ్యమైన త్రీఫేజ్ కరెంటు అందనుంది. లోవోల్టేజి సమస్య పరిష్కారం కానుంది. ఇదిలా ఉంటే పేటసన్నెగండ్ల గ్రామానికి కూడా 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైంది. నిర్మాణానికి రూ.3 కోట్ల నిధులు కూడా మంజూరయ్యాయి. స్థలం కూడా సిద్ధంగా ఉంది. గతంలో నక్సల్స్ ప్రభావం వల్ల వెనుకబడిన 8 గ్రామాలలో ఎల్‌డబ్ల్యూఎస్ స్కీం కింద ప్రస్తుతం కోట్లాది రూపాయల వ్యయంతో విద్యుత్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ గ్రామాలలో 24 గంటలు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ఉండే విధంగా పనులు జరుగుతున్నాయి. కాలం చెల్లిన విద్యుత్ స్తంభాలు, లైన్లు మార్చడం, అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఒప్పిచర్ల, నరమాలపాడు, మిరియాల, పేటసన్నెగండ్ల, రెడ్డిపాలెం, బట్టువారిపల్లె, వేపకంపల్లి, కాచవరం గ్రామాలలో ఈ పనులు జరుగుతున్నాయి.


అభివృద్ధి పనుల్లో భాగంగా ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్

24 గంటలు త్రీఫేజ్ విద్యుత్ సరఫరాకు చర్యలు..



ఈ 8 గ్రామాలతో పాటు మిగతా గ్రామాలలో కూడా 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండే విధంగా అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆర్‌డీఎస్ఎస్ స్కీం కింద ప్రస్తుతం సర్వే పనులు జరుగుతున్నాయి. ఎల్‌డబ్ల్యూఎస్ పనులు కన్‌స్ట్రక్షన్స్ విభాగం పర్యవేక్షణలో జరుగుతున్నాయి. మిగిలిన గ్రామాలలో కూడా నాణ్యమైన 24 గంటలు త్రీఫేజ్ కరెంటు అందించేందుకు కృషి జరుగుతోంది.

– కె.కోటేశ్వరరావు, ఏఈ, కారెంపూడి

లోటు లేకుండా కరెంటు ఇస్తున్నారు..



9 గంటలు కరెంటు ఇవ్వబట్టే పంటలు పండించుకోగలుగుతున్నాం. బోరు కింద మూడెకరాలలో ఖరీఫ్‌లో వరి పండించా. మళ్లీ రబీలో వరి వేయడానికి నారు పోశాం. వరితో పాటు మిర్చి కూడా రెండెకరాలలో సాగు చేస్తున్నా. కరెంటు సక్రమంగా లేకపోతే వరి పండడం అసాధ్యం. ఇచ్చే కరెంటు 9 గంటలు కంటిన్యూగా ఇవ్వబట్టి ప్రతి బోరుకు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ అమర్చబట్టి, విద్యుత్ సేవలు కూడా గతం కంటే మెరుగు కావడంతో బోర్ల కింద పంటలు సవ్యంగా పండించుకుంటున్నాం.

–షేక్ ఖాసిమ్, రైతు, కారెంపూడి

పదోన్నతిపై సీనియర్ అసిస్టెంట్ రాజారావు బదిలీ



రెంటచింతల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ జె.రాజారావును గురజాల ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతిపై బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు తెలిపారు. 2016 అక్టోబర్ నుంచి రెంటచింతల తహసీల్దార్ కార్యాలయంలో ఐఆర్‌గా, సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రాజారావు మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ మంచి అధికారిగా పేరు పొందారన్నారు. పదోన్నతిపై వెళ్తున్న రాజారావును మండల రెవెన్యూ అధికారులు అభినందించారు.

ప్రారంభమైన సత్తెమ్మతల్లి మాలధారణ



అచ్చంపేట: మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలోని స్వయంభు సత్తెమ్మతల్లి మాలధారణ కార్యక్రమాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాలు 20వ తేదీ వరకు కొనసాగుతాయని అమ్మవారి మాలధారణ గురుస్వామి యర్రంశెట్టి శ్రీనివాసరావు స్వామి తెలిపారు. గత 8 సంవత్సరాలుగా ప్రతి ఏటా మాలధారణ నిర్వహిస్తున్నామన్నారు. మార్చి 1న చండీయాగం నిర్వహించి దేవస్థానం వద్ద సత్తెమ్మతల్లి, సత్యదేవుల కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావలసినదిగా కోరారు.

20వ తేదీన దేవరంపాడు దేవస్థానంలో వేలం

రాజుపాలెం: దేవరంపాడు కొండపై వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో తిరునాళ్ల సందర్భంగా షాపుల వారికి వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈవో గుర్రం శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. మార్చి 16వ తేదీ నుంచి ఏప్రిల్ 9వ తేదీ వరకు కొండపై తిరునాళ్ల ఉత్సవాలు జరుగుతున్నందున కొబ్బరికాయలు అమ్ముకునే హక్కు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు, బియ్యం, బెల్లం, నెయ్యి, సేకరించుకునేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. అదేవిధంగా ఏప్రిల్ 13వ తేదీ నుంచి ఏడాదిపాటు కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాలు అమ్ముకునే హక్కు, కొబ్బరి చిప్పలు సేకరించుకునే హక్కు, నెయ్యి, బెల్లం, తలనీలాలు పోగు చేసుకునే హక్కుకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పాటలు జనవరి 20వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు దేవస్థానం కార్యాలయంలో నిర్వహిస్తామని తెలిపారు. సీల్డ్ టెండర్, బహిరంగ వేలం కూడా నిర్వహించబడతాయని తెలిపారు. వివరాల కోసం దేవస్థానం కార్యనిర్వహణ అధికారిని సంప్రదించాలని కోరారు.

హెల్త్ గ్రామ పంచాయతీపై జాతీయ వర్క్‌షాప్‌కు ఎంపీపీ

క్రోసూరు: కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో గురువారం నుంచి తిరుపతిలో పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా హెల్త్ గ్రామ పంచాయతీ అంశంపై జరుగు జాతీయ వర్క్‌షాప్‌కు క్రోసూరు ఎంపీపీ పి.కోటయ్యకు ఆహ్వానం అందినట్లు ఎంపీడీవో బి.మహేష్ బుధవారం తెలిపారు. ఈ అంశంపై ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి సాధించుటలో సుపరిపాలన, ప్రజలకు సేవలు మంచిగా అందించుట తదితర అంశాలపై తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో జాతీయ వర్క్‌షాప్ ఈనెల 20 వరకు ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమానికి మండలం నుంచి ఎంపీపీ హాజరవుతారని ఎంపీడీవో వివరించారు.

మైనర్ బాలికను వేధిస్తున్న యువకునిపై కేసు

నకరికల్లు: మైనర్ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఏ బాలకృష్ణ బుధవారం తెలిపారు. నకరికల్లులోని మైనర్ బాలికకు అదే గ్రామానికి చెందిన యువకుడు గత ఏడాదికాలంగా ఫోన్‌లో అసభ్యకరమైన మెసేజ్‌లు, సంభాషణలు చేస్తున్నాడు. అతని వేధింపులు తాళలేక బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉత్కంఠభరితంగా ఆడుదాం ఆంధ్రా


హోరాహోరీగా కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు


కారెంపూడి క్రికెట్ జట్టు

- హోరాహోరీగా ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు
- ఉత్సాహంగా పాల్గొంటున్న క్రీడాకారులు

రెంటచింతల: స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. బుధవారం ఆమె మండల స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. దేశ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం ద్వారా మారుమూల పల్లె ప్రాంతాలలోని యువతలో దాగిన ప్రతిభను వెలికితీస్తున్నట్లు తెలిపారు. పల్లెప్రాంతాలలో ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ఇప్పటి వరకు ఇటువంటి భారీస్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించిన దాఖలాలు లేకపోవడంతో యువతలో ఒక్కసారిగా ఉత్సాహం ఉరకలేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి ఆడుదాం ఆంధ్రా పోటీలకు విశేషంగా స్పందన లభిస్తుందన్నారు. కబడ్డీ పోటీలలో మిట్టగుడిపాడు, పాలువాయి గ్రామాలపై గెలిచి తుమ్మకోట, పశర్లపాడు, రెంటచింతల–3పై విజయం సాధించి జెట్టిపాలెం ఫైనల్‌కు చేరుకున్నాయి. వాలీబాల్ పోటీలలో రెంటాల, పశర్లపాడుపై విజయం సాధించి జెట్టిపాలెం ఫైనల్‌కు చేరిందని మరో సెమీఫైనల్ పోటీలో పాలువాయి, రెంటచింతల–1 గెలిచిన జట్టు ఫైనల్‌కు చేరుకుంటుందని కత్తి రవి తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జి.అనంత కోటేశ్వరరావు, కార్యదర్శి సోమేశ్వరరావు, పీఈటీలు రెంటాల బ్రహ్మం, మామిడి కళ్యాణి, సుభాని, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రికెట్ విన్నర్ కారెంపూడి జట్టు

కారెంపూడి: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రికెట్ పోటీలలో కారెంపూడి సచివాలయం జట్టు విన్నర్‌గా నిలిచింది. స్థానిక గురుకుల పాఠశాలలో బుధవారం కారెంపూడి, గాదెవారిపల్లె గ్రామాల జట్ల మధ్య ఫైనల్స్ జరిగాయి. కారెంపూడి జట్టు నాలుగు బంతులు మిగిలి ఉండగానే 79 పరుగుల లక్ష్యాన్ని సాధించింది. పోటీలను ఆడుదాం ఆంధ్రా మండల కన్వీనర్ ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. మొత్తం 11 టీమ్‌లు మండల స్థాయిలో ఆడగా కారెంపూడి గ్రామ సచివాలయం జట్టు విజయం సాధించింది. ఇప్పటికే అన్ని క్రీడలు ఫైనల్స్ పూర్తికాగా క్రికెట్ ఫైనల్స్ బుధవారం జరిగాయి.

ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు ఉండరాదు

- పల్నాడు జిల్లా మలేరియ అధికారి రవీంద్ర రత్నాకర్
- 14వ సచివాలయ పరిధిలో ఇంటింటికి అవగాహన


వెంగళరెడ్డినగర్‌లో ఇంటింటికి దోమలపై అవగాహన కల్పిస్తున్న రవీంద్ర రత్నాకర్

సత్తెనపల్లి: ఇంటి లోపల, ఇంటి బయట పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని పల్నాడు జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ అన్నారు. పట్టణంలోని వెంగళరెడ్డి నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని 14వ సచివాలయం వెంగళరెడ్డి నగర్‌లో వివిధ ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి ప్రజలకు దోమల వలన వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వలు దోమలకు పుట్టినిల్లు అని, ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమల వలన కీటక జనిత వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. ప్రజలు వీటి వలన అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేగా పాటించాలన్నారు. దోమల నివారణలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి బీపీ చంద్రశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్ వై.రాజేష్‌పాల్, హెల్త్ అసిస్టెంట్లు, హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు, తదితరులున్నారు.

మరపురాని జ్ఞాపకాలతో..


పదో తరగతి పూర్వ విద్యార్థులు

- పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక
- 33 ఏళ్ల తరువాత కలిసిన పూర్వ విద్యార్థులు

పెదకూరపాడు: పెదకూరపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1989–90 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం నిర్వహించారు. మూడు దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్న స్నేహితులందరు ఆనందంగా తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు.

చిన్ననాటి సంఘటనలు, అనుభూతులు నెమరేసుకున్నారు. సరదా కబుర్లతో ఆటపాటలతో సందడి చేశారు. అప్పట్లో విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. తమతోపాటు చదువుకున్న మృతిచెందిన విద్యార్థులు, విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు సంతాపం తెలిపారు. పూర్వ విద్యార్థులంతా ఒక కమిటీగా ఏర్పడి పాఠశాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు రమణకు తెలిపారు. గురువులకు విద్యార్థులు భోజనం వడ్డించడం ప్రత్యేకంగా నిలిచింది.

ట్రాక్టర్ డ్రైవర్‌కు ఆరు నెలలు జైలు శిక్ష

సత్తెనపల్లి/అమరావతి: మండల పరిధిలోని నెమలికల్లు–ఉంగుటూరు గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదానికి కారకుడైన బుల్లా అనిల్ బాబుకు ఆరు నెలల జైలు శిక్ష విధించారు. అతివేగంగా, నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడిపి ఒకరి మృతికి కారకుడైన డ్రైవర్‌కు ఆరు నెలలు జైలు శిక్ష, రూ.5 వేలు అపరాధ రుసుం విధిస్తూ సత్తెనపల్లి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్ బుధవారం తీర్పు ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. అమరావతి మండలం నెమలికల్లు గ్రామానికి చెందిన బుల్లా అనిల్‌కుమార్ 2017 అక్టోబర్ 14న రోడ్డు నిర్మాణ పనుల కోసం సూపర్‌వైజర్‌గా వచ్చిన నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామానికి చెందిన వేమూరి మహేష్‌ను తన ట్రాక్టర్‌లో ఎక్కించుకొని నెమలికల్లు నుంచి ఉంగుటూరు వెళ్లే మార్గంలో ఒక మూల మలుపు వద్ద అతివేగంగా, నిర్లక్ష్యంగా అనిల్‌కుమార్ ట్రాక్టర్ నడపడంతో ట్రాక్టర్ బోల్తా పడి వేమూరి మహేష్‌పై ట్రాక్టర్ పడటంతో మరణించాడు. మహేష్ కుటుంబ సభ్యులు అమరావతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు. సుదీర్ఘ విచారణ అనంతరం న్యాయమూర్తి ముద్దాయి బుల్లా అనిల్‌కుమార్‌కు సెక్షన్ 304 ఏ కింద ఆరు నెలలు, ఎంవీ యాక్ట్ 181 కింద మూడు నెలలు (ఏక కాలంగా ఆరు నెలలు) జైలు శిక్షను అనుభవించాలని, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసును ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ వడితే ప్రసాద్ నాయక్ వాదించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో యువకుడికి గాయాలైన ఘటన మండలంలోని ఇరుకుపాలెం సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాదల గ్రామానికి చెందిన శాసనాల విజయ్ ద్విచక్ర వాహనంపై సత్తెనపల్లి వైపు వెళుతుండగా, ఇరుకుపాలెం సమీపంలోని మదర్సా వద్ద నరసరావుపేట వైపు నుంచి వస్తున్న మరో ద్విచక్ర వాహనదారుడు ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో విజయ్ తలకు తీవ్ర గాయమవటంతో చికిత్స నిమిత్తం సత్తెనపల్లిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనం ప్రమాద స్థలంలోనే వదిలేసి వెళ్లటంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జరిగిన ఘటనపై విచారణ జరుపుతున్నట్లు ఎస్సై డి.కిశోర్‌బాబు తెలిపారు.

వైభవంగా పునీత ఆంతోని చర్చి తిరునాళ్ళ


తురకపాలెంలోని చర్చిలో సామూహిక పూజా కార్యక్రమం నిర్వహిస్తున్న విచారణ గురువులు

తురకపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని తురకపాలెం గ్రామంలో పునీత ఆంతోని చర్చి వార్షిక తిరునాళ్ళ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. తిరునాళ్ళలో భాగంగా చర్చిని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. పలు ప్రాంతాల్లో ఉన్న గ్రామస్తులంతా తిరునాళ్ళకు సొంత గ్రామానికి వచ్చి ఘనంగా జరుపుకుంటారు. తిరునాళ్ళలో ఉదయం 5 గంటలకు చర్చిలో ఆలయ విచారణ గురువులు నాగోతు చిన్నయ్య ఆధ్వర్యంలో దివ్య పూజ నిర్వహించారు. మహిళలు, చిన్నారులు, గ్రామస్తులు, అధిక సంఖ్యలో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం సమిష్టి దివ్యపూజాబలి నిర్వహించారు. కార్యక్రమంలో విచారణ గురువులు పుట్టి సుందరరాజు, జోజి రాయన్న, మల్లవరపు సుందరబాబు, పుట్టి ఆంథోనిరాజులతో పాటు మరో 30 మంది గురువులు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి కొవ్వొత్తుల సమర్పణ చేశారు. సాయంత్రం 5 గంటల నుంచి బాణసంచాతో గ్రామంలో తేరు ఊరేగింపు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మల్లవరపు చంద్రశేఖర్‌ప్రతాప్ ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు బహుమతులు అందించారు.

సంతోషంలో మొక్కజొన్న రైతులు



కారెంపూడి: మండలంలోని వేసిన మొక్కజొన్న పైర్లు ఆశాజనకంగా ఉన్నాయి. ప్రస్తుతం పైర్లు అన్నీ బాగా ఏపుగా పెరిగి కండె దశలో కనువిందు చేస్తున్నాయి. మరో నెల రోజులలోపే పంట చేతికి వస్తుంది. మొక్కజొన్న వేసిన రైతులు ఎకరాకు 40 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తుందని ఆశిస్తున్నారు. మండలంలో 750 ఎకరాల దాకా మొక్కజొన్న వేశారని ఏఓ బి.యలమందారెడ్డి తెలిపారు. అయితే ఎక్కువగా కంపెనీలతో ఒప్పందం చేసుకుని సీడ్ కోసం రైతులు మొక్కజొన్న సాగు చేస్తున్నారన్నారు. సీడ్ కోసం కావడంతో ముందుగానే కంపెనీలు రైతులతో ఒప్పందాలు చేసుకున్నాయి. క్వింటా రూ.2,800కు కొనే విధంగా ఒప్పందం చేసుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మొక్కజొన్న సాగు చేస్తున్న రైతుల్లో సంతోషం వ్యక్తం అవుతోంది.